క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



అలంపూర్: కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే విజయుడు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. మానవపాడుకు చెందిన పింజరి హుస్సేన్‌కు సీఎం సహాయ నిధి ద్వారా రూ.23 వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

సాదాబైనామాల క్రమబద్ధీకరణ

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో తహసీల్దార్ జోషిశ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ అధికారులు వెంకటేశ్వర్లు, సిబ్బంది కొర్విపాడు శివారు ప్రాంతంలో పంట పొలాలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాదా దస్తావేజుల క్రమబద్ధీకరణపై గ్రామాల్లో పర్యటిస్తున్నట్లు తెలిపారు. దీంతో దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న రైతులకు ఉపశమనం కలిగిందన్నారు. సాదా బైనామా దస్తావేజుల క్రమబద్ధీకరణ జరుగుతుందని పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

గద్వాల క్రైం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలో వెంకటేశ్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతని వద్ద రూ. 20 వేల విలుగల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

మానవపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధమైన ఘటన మండలంలోని కొర్విపాడులో బుధవారం జరిగింది. గ్రామంలోని 11 కేవీలైన్ విద్యుత్ తీగలు తెగి ఎల్టీలైన్ తీగలపై పడటంతో షార్ట్ సర్క్యూట్ సంభవించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో బాలరాముడు, మద్దిలేటి, శివరామిరెడ్డి, పుల్లారెడ్డి గృహాల్లోని ఫ్రిజ్, ఫ్యాన్లు, టీవీ తదితర వస్తువులు కాలిపోయినట్లు పేర్కొన్నారు.

రాయితీపై వ్యవసాయ పనిముట్లు

అలంపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై వ్యవసాయం పనిముట్లను అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి నాగార్జున్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2025–26 పథకం కింద ఈ పనిముట్లను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. జనరల్ కేటగిరీ రైతులకు 40 శాతం సబ్సిడీపై పనిముట్లు అందజేస్తారని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చెశారు. విజిలెన్స్ అవేర్నెస్ వారోత్సవాల్లో భాగంగా యూనియన్ బ్యాంక్ సహకారంతో ఓమ్ని ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవి కుమార్ రెడ్డి తెలిపారు. 130 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది నాగరాజు, నాయకులు మహేశ్వర్‌గౌడ్, ఓమ్ని వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి

అయిజ: చేతులు శుభ్రంగా ఉంచుకొని అనారోగ్యాలకు దూరంగా ఉండాలని వైద్యురాలు ఇందు మైత్రికిరణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎన్‌జీఓ సంస్థ భవిష్య భారత్ సౌజన్యంతో వరల్డ్ గ్లోబల్ హ్యాండ్ వాష్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సత్యారెడ్డి, యశోద, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే చర్యలు

మానవపాడు: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సుజాత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెన్నిపాడులో జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎత్తం శివ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే 1098కు ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

సాగునీటి కాల్వలు అధ్వానం

- పిచ్చిమొక్కలు పెరిగి, లైనింగ్ వాల్స్ కూలిన వైనం
- మరమ్మతు మరిచిన ఆర్డీఎస్ అధికారులు
- రూ. 13కోట్లు మంజూరైనా.. పూర్తికాని పూడికతీత పనులు



చంద్రశేఖర్‌నగర్‌లో డీ–29 కాల్వలో పేరుకుపోయిన చెత్త

మానవపాడు: మండలంలోని సాగునీటి కాల్వలపై ఇరిగేషన్ అధికారుల పట్టింపు కరువైంది. ఆయకట్టు కింద ఏర్పాటు చేసిన లైనింగ్ వాల్స్ కూలిపోయి, తూములు మరమ్మతుకు నోచుకోకపోవడంతో కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరిగి పంటలకు పూర్తిస్థాయిల్లో నీరు అందడం లేదు. దీంతో ఆయకట్టుకు సరిగా నీరందక నానా అవస్థలు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు.

పిచ్చిమొక్కలు దర్శనం

ఆర్డీఎస్ కాల్వల్లో పనుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ అధికారులు అలసత్వం కారణంగా కాల్వల్లో చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. సిబ్బంది ఫీల్డ్ వర్క్ పేరుతో కాలం గడుపుతున్నారని రైతుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. పూడీకతీత పనులు సరిగా చేయకపోవడంతో కిందిస్థాయికి సాగునీరు అందక అవస్థలు తప్పడం లేదని అన్నదాతలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సాగునీరు అందేలా.. కాల్వల పూడికతీత పనులు చేయాలని రైతులు కోరుతున్నారు. ఆర్డీఎస్ ఈఈ శ్రీనివాస్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఎలాంటి స్పందన లేదు.

రూ.13 కోట్లు మంజూరు

మండలంలోని డీ– 29, డీ– 30 కాల్వల్లో పూర్తిస్థాయిలో పూడీకతీత పనులు చేయకపోవడంతో కిందిస్థాయి ఆయకట్టు రైతులు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్డీఎస్ కాల్వల మరమ్మతుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో దాదాపు రూ.13 కోట్లు నిధులు మంజూరైన ఇరిగేషన్ అధికారులు తూతూ మంత్రంగానే పనులు చేశారు. డీ–30 కాల్వ మానవపాడు శివారు వారకు మాత్రమే పనులను చేశారంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. చెన్నిపాడు, పెద్దపోతులపాడు, మెన్నిపాడు, చంద్రశేఖర్‌నగర్, కొర్విపాడు డీ–29 కాల్వల్లో పూర్తిస్థాయిలో అపూడీకతీత పనులు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చెన్నిపాడులో కూలిన డీ–30 కాల్వ గోడ

సాగునీరు అందించండి



చెన్నిపాడు గ్రామ శివారు ప్రాంతంలోని పంట పొలాలకు సాగునీరు అందడం లేదు. డీ– 30 కాల్వ ద్వారా నీరు రావాలి కానీ కాల్వలో ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలతో నిండి పోయింది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మద్దిలేటి, చెన్నిపాడు

చర్యలు తీసుకోవడం లేదు.



ఆర్డీఎస్ కాల్వలో పూడీకతీత తీయకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగు నీరు అందడం లేదు. అధికారులు, సిబ్బంది తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్నారు. రైతులు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేస్తూ నీటి కోసం అవస్థలు పడుతున్నారు. తక్షణమే కాల్వల మరమ్మతు చేపట్టాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, మానవపాడు

బాలల హక్కులను కాపాడుదాం



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహులు

అయిజ: బాలల హక్కులను ప్రతి ఒక్కరు కాపాడాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహులు అన్నారు. బుధవారం మండలంలోని పులికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ ఆధ్వర్యంలో బాలల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహులు హాజరై మాట్లాడారు. బాలల పరిరక్షణ కోసం బాలరక్ష భవన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలపై 100, 1098కి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్, హెచ్‌ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీఐని సద్వినియోగం చేసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గట్టు: సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సమాచారాన్ని పొందే అవకాశం ఉందని, సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం చట్టంగా మారి 20 ఏళ్లు అయిన సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటుగా ప్రభుత్వ ఉద్యోగులు, పౌరుల కలిసి కార్యాలయం వద్ద ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు రాజు, షేక్షావలి, కార్యాలయ సిబ్బంది, గట్టు–2 మాజీ ఎంపీటీసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి



యాక్తాపురంలో టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

ఎర్రవల్లి: గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టీకాలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశువైద్య అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని యాక్తాపురంలో అలంపూర్ పశువైద్య అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌నారాయణ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గేదెలు, తెల్లజాతి పశువుల్లో గాలికుంటి వ్యాధి అధికంగా వస్తుందన్నారు. పశువైద్య సిబ్బంది ఆయా గ్రామాల వారీగా టీకాలు పంపిణీ చేస్తార్నారు. కార్యక్రమంలో పశువైద్య అధికారులు డాక్టర్ భువనేశ్వరి, శంకరయ్య, వెంకటరాజు, పుష్పలత, ఉష తదితరులు పాల్గొన్నారు.


ఉచిత పశువైద్య శిబిరం

గట్టు: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఉచిత పశువైద్య శిబిరాన్ని భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు ప్రియాంక మాట్లాడుతూ.. పశువుల యజమానులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. నట్టల నివారణ మందులు ఏడాదిలో మూడు పర్యాయాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పృథ్వీకుమార్, కనకరాజు, ఖాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

శాంతినగర్: పశువులు, జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని మండల పశుసంవర్ధక శాఖ వైద్యులు స్వరూపరాణి అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమర్సు గ్రామంలో పశువులకు బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. పాల దిగుబడి తగ్గకుండా ఉండేందుకు టీకాలు వేయించి పశువులను ఆరోగ్యంగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, వెంకటమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గట్టు: చిన్నోనిపల్లె పునరావాస కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బుధవారం చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తులు కలెక్టర్ సంతోష్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధరూరు మండలం ర్యాలంపాడు గ్రామంలో పునరావాస సమస్యలపై నిర్వహించిన సమావేశానికి చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తులు హాజరై సమస్యలు విన్నవించారు. పునరావాస కేంద్రంలో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైయినేజీ, ఆరోగ్య కేంద్రం, దేవాలయాలు, పాఠశాల భవనాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, శ్రీనివాసులు, బజారి, కుర్వ నర్సింహులు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థుల గుర్తింపు

ధరూరు: మండలంలోని చింతరేవుల, మన్నాపురం, గ్రామ పరిసరాల్లోని వ్యవసాయ పొలాల్లో పని చేస్తున్న బాల కార్మికులను అధికారులు గుర్తించారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యాహక్కు చట్టం, బాలకార్మిక నిషేధ చట్టం ప్రకారం చిన్నారులు పనుల్లో పెట్టుకోకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖోఖో పోటీలు

అలంపూర్: జిల్లాస్థాయి ఖోఖో పోటీలు ఈ నెల 16న పట్టణంలోని మాంటిస్సోరీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అశోక్‌కుమార్, మండల కన్వీనర్ భరత్‌కుమార్, పీడీ పార్వతమ్మ బుధవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి అండర్–14 విభాగంలో ఖోఖో పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని 13 మండలాల నుంచి అండర్–14 విభాగంలో విద్యార్థులు హాజరువుతున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



అయిజ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం 'ఏ బుక్ ఆఫ్ డిజిటల్ లెర్నింగ్'కు సంబంధించి అయిజ, వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు మండల ఎంఈఓ, కోర్స్ డైరెక్టర్ రాములు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్‌లో డిజిటల్ లెర్నింగ్‌కు ప్రాముఖ్యత ఉంటుందన్నారు. ఉన్న వనరులను పూర్తిస్థాయిలో వాడుకొని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ లక్ష్మన్న, జిల్లా రిసోర్స్‌పర్సన్ దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



గద్వాల క్రైం: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన బుధవారం గద్వాల పట్టణంలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాలు.. స్థానిక నల్లకుంట కాలనీలో నివాసం ఉంటున్న హైమావతి(ప్రభుత్వ టీచర్) విధుల్లో భాగంగా పాఠశాలకు ఇంటికి తాళం వేసి వెళ్లింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తాళం ధ్వంసం చేసి ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.80 వేల నగదు, 5 గ్రాముల బంగారు, 5 గ్రాముల వెండి ఆభరణాలు అపహరించారు. సాయంత్రం విధులు ముగించుకొని ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు హైమావతి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పట్టణ ఎస్‌ఐ కల్యాణ్ కుమార్ విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై కళాజాతా

మల్దకల్: సీజనల్ వ్యాధులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులు కేశవులు, హజరత్ సూచించారు. బుధవారం మండలంలోని బిజ్వారం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాతా బృంద సభ్యులు పరిసరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆటపాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో స్వామి, భూపతి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



గంగన్‌పల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

కేటీదొడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని శివరంగాపురం, గంగన్‌పల్లి, పాతపాలెం ప్రభుత్వ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులుతో సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. వంట ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ పాపయ్య, హెచ్‌ఎం రాఘవేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మానవపాడు: విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ శివప్రసాద్ అన్నారు. మండలంలోని జల్లాపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పక సమయపాలన పాటించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన చిల్ల చెట్లను తొలగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతర కృషి విజయానికి కీలకం



ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక

గట్టు: ప్రతి విద్యార్థి నిరంతర కృషి విజయానికి కీలకమని జిల్లా ఉపాధి కల్పన అధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. బుధవారం ఆలూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువు ప్రణాళిక, స్వీయ ప్రేరణ, సరైన కెరీర్ మార్గం, చదివిన విషయాన్ని అర్థం చేసుకోవడం వంటి అంశాలు విద్యార్థుల భవిష్యత్‌ను మెరుగు పరిచే ముఖ్యమైన మూలాధారాలన్నారు. ప్రతి 45 నుంచి 50 నిమిషాల తర్వాత 5 నుంచి 10 నిమిషాల విరామం తీసుకోవడం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందన్నారు. మంచి నిద్ర, ఆరోగ్యకరమైన ఆహారం, ఆటలు విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని చురుకుదనాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని వంట ఏజెన్సీని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శాంతినగర్: నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక అలంపూర్– రాయచూర్ ప్రధాన రహదారిపై బుధవారం ఎన్టీఆర్ విగ్రహం నుంచి అంబేడ్కర్ చౌరస్తా ప్లకార్డులు పట్టుకొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిధులు వెంటనే విడుదల చేసి విద్యాభివృద్ధికి చేయూత అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రీప్రైమరీ పాఠశాలలను రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అలంపూర్: ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న ప్రీ ప్రైమరీ పాఠశాలలను రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమెలమ్మ కోరారు. పట్టణంలో తహసీల్దార్ మంజులకు బుధవారం ప్రీప్రైమరీ పాఠశాలలను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏమెలమ్మ మాట్లాడుతూ.. నాలుగేళ్ల నుంచి ఐదేళ్ల పిల్లలు విద్యను అభ్యసించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పాఠశాలలను తీసుకొచ్చిందన్నారు. కానీ 50 ఏళ్ల నుంచి మూడేళ్ల నుంచి ఐదేళ్ల పిల్లలకు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. మూడేళ్ల నుంచి ఐదేళ్ల పిల్లలకు శారీరక, మానసిక భావోద్వేగా భాషను పరిచయాలు సంసిద్ధతకు సంబంధించి అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు. బిడ్డ ఎదగానికి అంగన్ వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. శారీరక అభివృద్ధికి ఆటపాటలతో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రీ ప్రైమరీ పాఠశాలలతో అంగన్‌వాడీ కేంద్రాలకు నష్టం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించి అందంగా ఆకర్షణీయంగా ఆధునీకీకరిస్తే అందులో ప్రీ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయవచ్చని పేర్కొన్నారు. ముందుగా రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల పోస్టులు భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి ముందుకు రాకపోతే అందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శాంతమ్మ, మాధవి, సావిత్రి, పుష్పావతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి



బహుమతులు అందజేస్తున్న అధికారులు

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎజీఎఫ్ జోనల్ లెవల్ అండర్– 14 బాలబాలికల కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించినట్లు హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా డీవైఎస్‌ఓ కృష్ణయ్య హాజరై క్రీడలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. ఓటమి గెలుపులను సమానంగా తీసుకోవాలన్నారు. పోటీల్లో బాలుర విభాగంలో గద్వాల జిల్లా జట్టు ప్రథమ, వనపర్తి జిల్లా ద్వితీయ స్థానం గెలుపొందాయి. బాలికల విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రథమ, మహబూబ్‌నగర్ జట్టు ద్వితీయ స్థానం గెలుపొందినట్లు అధికారులు తెలిపారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసి ఈ నెల 16న సంగారెడి జిల్లాలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కలాం సేవలు చిరస్మరణీయం



జిల్లా కేంద్రంలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



అలంపూర్‌లో అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: మాజీ రాష్ట్రపతి, భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ కలందర్‌బాషా అన్నారు. జిల్లా కేంద్రంలో కలాం జయంతి వేడుకలు కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు కొనియాడారు. అబ్దుల్‌కలాం జీవితచరిత్ర, ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రమోహన్, అధ్యాపకులు రాధిక, సామాజిక కార్యకర్త అంజిసాగర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ జోగులరవి, సోమనాద్రి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు శరత్‌బాబు నాగమల్లయ్య, రంగస్వామి, నరేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



ఎర్రవల్లిలో..

ధార్మిక మార్గంలో నడవాలి

ఇటిక్యాల: ప్రతి ఒక్కరూ ధార్మిక మార్గంలో నడవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు అన్నారు. మండలంలోని కొత్తదేవరపల్లిలో గ్రామ కమిటీ సభ్యుల సహకారంతో విశ్వహిందూ పరిషత్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో పాండురంగ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన భాగవత సప్తాహం బుధవారం మూడో రోజు వైభవంగా కొనసాగింది. భాగవత నేపథ్యం, ఆవిర్భావాన్ని గురించి వివరించారు.